మెదక్ చర్చి.. నూరేళ్ల ఘనకీర్తి

- వందేళ్ల వార్షికోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు
- ఏసు పుట్టుకను తెలిపేలా కిటికీలు
- 23న శతాబ్ది ఉత్సవాలు... చార్లెస్ వాకర్ పాస్నెట్ కుటుంబీకుల రాక
- వెయ్యి ఎకరాల భూమిని కేటాయించిన ఆరో నిజాం
- 1914లో మెదక్ చర్చి నిర్మాణం

ఏసు పుట్టుకను తెలియజేసే కిటికీ

మెదక్ చర్చి

మెదక్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): ఆసియాలోనే రెండో అతిపెద్ద క్రైస్తవ పుణ్యక్షేత్రంగా మెదక్ చర్చి వర్ధిల్లుతోంది. 175 అడుగుల ఎత్తు, 100 అడుగుల వెడల్పుతో ఠీవీగా కనిపించే ఈ చర్చిని భారతీయ, విదేశీ కళా నైపుణ్యాల మేళవింపుతో నిర్మించారు. రెండంతస్తుల్లో నిర్మించిన ఈ కట్టడం, శిఖరం వందేళ్లు పూర్తైనా చెక్కు చెదరలేదు. రంగురంగుల గాజు ముక్కలతో చర్చి లోపలి భాగంలో ఏర్పాటు చేసిన పెయింటింగ్స్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. ఏసుక్రీస్తు పుట్టుక, శిలువ వేయడం, ఆరోహణం ఇవన్నీ ఈ పెయింటింగ్స్‌లో కనిపించడం ప్రత్యేకత. ఇవన్నీ ఒకే గాజుపై వేసినవి కాదు. ఇంగ్లండ్‌లో గాజు ముక్కలపై విడివిడిగా పెయింటింగ్ వేసి ఇక్కడికి తీసుకొచ్చి అమర్చారు. ఇవి సూర్య కిరణాలు పడితేనే కనిపిస్తాయి. అంటే ఉదయం 6 నుంచి సాయంత్రం 6 మధ్య ఈ పెయింటింగ్స్ కనిపిస్తాయి. 6 గంటల తర్వాత ఫ్లడ్ లైట్స్ వేసి వెతికినా కనిపించవు. దీని వెనుక ఉన్న సైన్స్ అందరినీ అబ్బురపరుస్తుంది.

1914లో మెదక్ చర్చి నిర్మాణం

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సీఎస్ఐ చర్చి నిర్మాణాన్ని ఇంగ్లాండ్‌కు చెందిన రెవరెండ్ చార్ల్స్ వాకర్ ఫాస్నెట్ 1914లో ప్రారంభించారు. 1924 డిసెంబర్ 25న పూర్తయ్యింది. పదేళ్ల పాటు సుమారు 12 వేల మంది కూలీలు ఈ నిర్మాణంలో పాలుపంచుకుని ఉపాధి పొందారు. దీనికి

ఏసు జన్మ వృత్తాంతం

అప్పుడు రూ.14 లక్షల వ్యయం అయ్యింది. ఈ చర్చి నిర్మాణ సమయంలోనే మెదక్‌కు 'మెతుకు సీమ' అనే పేరు వచ్చిందంటారు. చర్చికు పంచద్వారాలున్నాయి. యూదా దేశ నాయకుడు ఆది, నిర్గమ, లేవి, సంఖ్య, ద్వితీయోపదేశ కాండలు రాశారు. ఈ ఐదు కాండాలకు గుర్తుగా ఐదు ద్వారాలు నిర్మించారు. 40 రోజుల ఉపవాస దీక్షలకు గుర్తుగా 40 స్తంభాలు, 66 దిమ్మెలు.. 66 గ్రంథాలు చర్చి లోపలికి వెళ్తుంటే పది మెట్ల తర్వాత చుట్టూరా 66 చొప్పున ఎడమ, కుడి వైపు విద్యుత్ సొబగులు సమకూరేలా తామర పూలతో నిర్మించిన దిమ్మెలు గొలుసులతో కలపబడి ఆకర్షణగా నిలుస్తాయి.

వెయ్యి ఎకరాల భూమి కేటాయింపు

ఈ చర్చి నిర్మాణం కోసం ఆరో నిజాం 1000 ఎకరాల భూమిని కేటాయించారు. తొలుత దీన్ని 180 అడుగుల ఎత్తుతో నిర్మించేందుకు ప్రణాళికలు రచించారు. ఐతే చార్మినార్ ఎత్తు కంటే ఎక్కువ ఉండకూడదని పాలకులు ఆదేశించడంతో 5 అడుగుల ఎత్తు తగ్గించి నిర్మించారు. అప్పట్లో చర్చి నిర్మాణానికి రూ.14 లక్షలు ఖర్చు చేశారు. చర్చిలో ఒకేసారి 5 నుంచి 6 వేల మంది కూర్చొని ప్రార్థనలు చేసుకోవచ్చు.

ఏసు పుట్టుకను తెలిపేలా కిటికీలు

చర్చిలో మొత్తం మూడు గాజు కిటికీలు ఉన్నాయి. వీటిని ఇంగ్లాండ్‌కు చెందిన ఫ్రాంక్ ఓ సాలిజ్బరీ రూపొందించాడు. చర్చి లోపల ఆరాధించే స్థలంలో ఒకటి చొప్పున

మెదక్ చర్చి ప్రవేశ ద్వారము

ఉత్తరం, తూర్పు, పడమర వైపు నిర్మించారు. ఈ కిటికీలపై సూర్యకిరణాలు పడితే అపురూప దృశ్యాలు కనపడతాయి. తూర్పు కిటికీ ఏసు జన్మ వృత్తాంతం, పుట్టుకను తెలియజేసేలా 1947లో అమర్చారు. కింది భాగంలో ఏసు తల్లి మరియ, తండ్రి యేసేపు, తొట్టెలో బాల యేసు, ఎడమ వైపు గొల్లలు, మధ్యలో గాబ్రియల్, లోక రక్షకులు, కుడి వైపు జ్ఞానులు ఉంటారు.

ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో భక్తులు (ఇన్‌సెట్‌లో) అమ్మవారు

దుర్గామాత సన్నిధిలో భక్తుల సందడి

పాపన్నపేట, డిసెంబర్ 22: ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో ఆదివారం పెద్దఎత్తున భక్తుల సందడి నెలకొన్నది. ఆలయ అర్చకులు అమ్మవారి మూలవిరాట్ విగ్రహానికి అభిషేకం చేశారు. పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏడుపాయల ఈవో చంద్రశేఖర్, సంబంధిత సిబ్బంది సూర్యశ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, నర్సింలు, వర్ణాచారి, రాజు తదితరులు ఏర్పాట్లు చేశారు. ఏడుపాయల్లో ఎలాంటి ఘటనలు జరగకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తగిన బందోబస్తు చర్యలు చేపట్టారు.

నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే

డి.ధర్మారం గ్రామంలో నల్ల పోచమ్మ అమ్మవారును దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే

రామయంపేట, డిసెంబర్ 22: మండలంలోని డీ.ధర్మారం గ్రామం ఎస్సీ కాలనీలో ఉన్న నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. రాష్ట్రంలో దేవాలయాలకు కేసీఆర్ పెద్ద పీట వేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్ చంద్రం, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు సిద్దిరాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఉడుత సిద్ధయ్య, శంకర్, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆత్మ రక్షణకు కరాటే అవసరం

నిజాంపేట, డిసెంబర్ 22: ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని కరాటే గ్రాండ్ మాస్టర్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నస్కల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కరాటే పోటీలను నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు అవార్డు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో స్వామి, శంకర్, సాయి, కుమార్, సురేశ్, శివ, ప్రశాంత్, విజయ్ ఉన్నారు.

రేగోడ్‌లో ఉపాధి హామీ 14వ సామాజిక తనిఖీ

సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

రేగోడ్, డిసెంబర్ 22: మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ 14వ సామాజిక తనిఖీని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఆర్డీవో రంగాచారి మాట్లాడుతూ మండలంలోని 18 పంచాయతీల్లో ఉపాధి హామీ, సీసీ రోడ్డు పనులకు రూ.4కోట్ల 93 లక్షల 87 వేల పనులు జరిగాయన్నారు. ఇందులో కోటి 79 లక్షల 87 వేలతో సీసీ రోడ్డు పనులు జరిగాయి గాని పంచాయత్‌రాజ్ శాఖ తనిఖీలో పొందుపర్చలేదన్నారు. 42 వేలు రికవరీ, 29 వేల ఫెనాల్టీ వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీఎం రాజేందర్‌రెడ్డి, ఎస్ఆర్పీ జీవన్, ఆడిటర్ సంపత్, ఎంపీడీవో సీతారావమ్మ, ఏపీఎం జగన్మోహన్ సింగ్, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

చిన్నశంకరంపేట, డిసెంబర్ 22: మండలంలోని చెన్నాయపల్లికి చెందిన గురుపాదం చేపల వేటకు వెళ్లి నీటమునిగి మృతి చెందాడు. బాధిత కుటుంబానికి లీలా గ్రూప్ చైర్మన్ మోహన్‌నాయక్ ఆదివారం రూ.5వేల ఆర్థిక సాయం, 25 కిలోల బియ్యం అందించారు.

నిరుపేద వధువుకు పుస్తెమట్టెలు అందజేత



రామాయంపేట, డిసెంబర్ 22: పట్టణానికి చెందిన గంగారాం-రమ కమార్తె వివాహానికి సంఘసేవకుడు ఎర్రం ఆంజనేయులు పుస్తెమట్టెలను ఆదివారం అందజేశారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

పెద్దశంకరంపేట, డిసెంబర్ 22: గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని పెద్దశంకరంపేట లోని సరస్వతీ శిశుమందిరం సంస్కార్ విద్యాలయంలో ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు రామచంద్రాచారి, కోసం విఠల్, సుభాశ్‌గౌడ్, రాజేశ్వర్, మధు, నారాగౌడ్, రాజన్‌గౌడ్, దాచ సంగమేశ్వర్, పెరుమాండ్లుగౌడ్, రాజశేఖర్‌రెడ్డి, తదితరులున్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్

కలలు సాకారమయ్యేందుకు శ్రమించాలి

- రెసిడెన్షియల్ స్కూళ్లు బంగారు భవిష్యత్‌నివ్వాలి
- పుస్తకాలే నాకు నేస్తాలు
- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

కొల్చారం: గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం: విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న గవర్నర్

కొల్చారం, డిసెంబర్ 22: విద్యారులు తాము కన్న కలలు సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తెలిపారు. ఆదివారం కొల్చారం లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థినులు మార్చ్ పాస్ట్‌తో గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని గవర్నర్ స్థానిక ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థినులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ సదర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విద్యార్థినులు తనను మార్చ్ పాస్ట్‌తో స్వాగతించినప్పుడు సంతోషించానన్నారు. ఇక్కడి విద్యార్థినులు మౌంటేయిన్ ట్రెక్కింగ్‌లో పాల్గొన్నారని చెప్పడంతో మంరింత అబ్బురపడ్డానన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలు బాలికలకు బంగారు భవిషత్తు ఇవ్వాలని కోరుతున్నానన్నారు. తాము కన్న కలలు సాకారమయ్యేందుకు నిరంతరం శ్రమించాలన్నారు. విద్యార్థినిలతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. క్రీడల్లో తనకు బాడ్మింటన్ అంటే ఇష్టమని, మాజీ ఉప రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శమన్నారు. నిరంతరం చదవడం, రాయడంపైనే ఆసక్తి చూపూతానని తెలిపారు. పుస్తకాలే తనకు నేస్తాలన్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ భిన్న సంస్కృతులను మేళవిస్తూ విద్యార్థినులు సాంగించిన నృత్యాలు అలరించాయన్నారు. అనంతరం గవర్నర్ విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, రెసిడెన్షియల్ స్కూల్స్ సెక్రటరీ వర్షిణి, అదనపు కలెక్టర్ నగేశ్ పాల్గొన్నారు.

బంగారమ్మ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే

శివ్వంపేట, డిసెంబర్ 22 : బంగారమ్మ దీవెనలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో బంగారమ్మ రెండో వార్షికోత్సవం సందర్భంగా భక్తులు అమ్మవారి కల్యాణం, బోనాలు, ఒడిబియ్యం సమర్పించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గోవిందర్‌నాయక్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ అనూష అశోక్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ సంధ్య వెంకటస్వామి, నాయకులు శ్రీశైలంయాదవ్, బాబురావు, సత్యంగౌడ్, గునంగారి రాజు ఉన్నారు.

ఎల్ఓసీతో బాధితులకు ఆర్థిక భరోసా

కౌడిపల్లి, డిసెంబర్ 22: ఎల్వోసీతో బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వడ్ల మహేశ్‌కు మంజూరైన రూ.లక్ష ఎల్వోసీ చెక్కును లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు కిశోర్‌గౌడ్, గుంజరి ప్రవీణ్, ప్రతాప్‌గౌడ్, రవిసాగర్ ఉన్నారు.

కౌడిపల్లి: ఎల్వోసీ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

సమగ్ర శిక్షా ఉద్యోగులపై సర్కార్ కన్నెర్ర

జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ఉద్యోగుల సమ్మె

రామాయంపేటలో మండల వనరుల కేంద్రానికి తాళం

- 13 రోజులుగా సమ్మె కొనసాగుతున్నా పట్టించుకోని ప్రభుత్వం
- మద్దతు పలుకుతున్న వివిధ ఉద్యోగ సంఘాలు
- వెలవెలబోతున్న కేజీబీవీలు

రామాయంపేట, డిసెంబర్ 22: సమస్యలు పరిష్కరించాలంటూ సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె 13వ రోజుకు చేరుకున్నది. దీంతో టీచర్లు, ఉద్యోగులు లేక మండల వనరుల కేంద్రాలు, కేజీబీవీలు వెలవెలబోతున్నాయి. పదో తరగతి పరీక్షలు దగ్గర్లో ఉండడంతో తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్ ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమకు న్యాయం చేస్తామని సీఎ రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు సర్వేకు వెళ్లడంతో వెలవెలబోతున్నాయి. మధ్యాహ్న భోజన బియ్యం తీసుకొచ్చేందుకు వెళితే అక్కడా ఈ ఉద్యోగులు అందుబాటులో లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు విధుల్లో లేక విద్యా వ్యవస్థ మరింత భ్రష్టుపట్టిపోతున్నదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలన్నీ ముక్తకంఠంతో మద్దతు తెలుపుతున్నాయి.

పనికి తగిన వేతనం ఇవ్వాలి

జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు 600 మందికి పైనే ఉన్నారు. ఎన్నికల ముందు హనుమకొండలో దీక్షలు చేస్తున్న తమ దగ్గరికి సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే సమస్యలు పరిష్కరిస్తానని మాటిచ్చారు. ఆ మాట ప్రకారం తమకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా, ఇన్సూరెన్సు కల్పించాలి. సీఎం ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలి. హామీలు అమలయ్యేంత వరకు సమ్మెలో కొనసాగుతాం.

- ఆకుల రాజు, సమగ్ర శిక్షా జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలి. కేజీబీవీలో పదో తరగతి ప్రత్యేక క్లాసులు నిలిచిపోయాయి. తమకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమాతో పాటు పనికి తగ్గ వేతనం ఇవ్వాలి. వేతన సవరణ చేస్తేనే విధుల్లో చేరుతాం. సీఎం తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

- కృష్ణతేజ, కేజీబీవీ టీచర్, మసాయిపేట

నేడు కర్నాల్‌పల్లి ఎల్లమ్మ ఆలయం వద్ద మోకు దెబ్బ సమావేశం

చేగుంట, డిసెంబర్ 22: కర్నాల్‌పల్లి ఎల్లమ్మ దేవాలయం వద్ద గౌడ జన హక్కుల పోరాట సమితి, మోకు దెబ్బ రాష్ట్రస్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా నాయకుడు బుచ్చన్నగారి కిషన్‌గౌడ్ ఆదివారం తెలిపారు. సమావేశంలో మహిళా జిల్లా కమిటీలు ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

బెజ్జంకి, డిసెంబర్ 22: వరకట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకున్నది. ఎస్సై కృష్ణారెడ్డి వివరాల ప్రకారం దేవక్కపల్లికి చెందిన వడ్లకొండ శ్రీకాంత్‌కు కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరికి చెందిన అశ్విని(27)తో వివాహమైంది. వీరికి కుమారుడు ఉన్నాడు. డబ్బులు తీసుకురావాలని శ్రీకాంత్ వేధించడంతో మనస్తాపంతో ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది.

శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం

పీఆర్టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి

మాట్లాడుతున్న పీఆర్టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి

మెదక్, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): క్రీడలు శారీరక దృఢత్వానికి దోహదపడుతాయని పీఆర్టీయూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో పీఎన్ఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఉమ్మడి మెదక్ జిల్లా ఉపాధ్యాయ బ్యాడ్మింటన్ టోర్నీని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మెదక్‌లోనే ఉపాధ్యాయ శిక్షణ పొందానని, రోజూ ఈ స్టేడియం పక్కనే ఉన్న గ్రౌండ్లో తోటి స్నేహితులతో క్రికెట్ ఆడేవాళ్లేమని గుర్తుచేసుకున్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పుడు క్రీడలకు అవసరమయ్యే సామగ్రిని వీఎమ్ఆర్ స్వచ్ఛంద సంస్థ ద్వారా పాఠశాలలకు ఇచ్చేవాడినన్నారు. గతేడాది నుంచి ప్రతి జిల్లాలో ఎస్‌జీఎఫ్ గేమ్స్ కూడా ప్రోత్సహిస్తూ క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేలా చేస్తున్నానన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడలపై ఆసక్తి కనబరుస్తూ ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి జాతీయస్థాయిలో విద్యార్థులు పాల్గొనేలా చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు చేస్తున్న సేవలను ఆయన కొనియాడారు. జిల్లా క్రీడల అధికారి నాగరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, పీఆర్టీయూ అధ్యక్షుడు సుంకరి కృష్ణ, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, మధు, ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ క్రీడాకారులు వినోద్, పంపం ప్రవీణ్, శిరిగే చంద్రశేఖర్, పక్షి శివ, దేవుల, శ్రీధర్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, జిల్లా నాయకులు సబ్బని శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, ఎల్.మల్లారెడ్డి, నరేందర్‌రెడ్డి, ఆశయ్య మహేశ్, పంతులు రాజు, హరిబాబు, దాసరి సురేశ్, ఏగొండ, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

FOR SALE

★Prime properties for sale at Siddipet Please contact : 9299008929, 6304851467, 8185855813
NT-99351

EDUCATION

★రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA. Dr. J S అకాడమి (ISO 9001 : 2015 సర్టిఫైడ్). ఫోన్: 8866977112
NT-337306

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.